సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 19 । జనవరి । 2025

ఊరంతా ఊట బావులే..

- వ్యవసాయ బావులకు కేరాఫ్ అప్పనపల్లి
- తరాల నుంచి వీటితోనే పంటల సాగు
- 600 పైగా బావులుంటే.. 20 లోపు మాత్రమే బోర్లు
- 15 గజాల లోతుల్లోనే నీటి ఊటలు



వివరాలు 8లో ▸

దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామంలో నేటికీ వ్యవసాయ బావులపైనే ఆధారపడుతున్నారు. 15 గజాలు తవ్వితే చాలు నీరు ఉబికి వస్తుంది. ఊరంతా ఇదే పరిస్థితి. దీంతో గ్రామంలో బోర్లు వేయడం మానేసి.. బావులు తవ్వుతున్నారు. పచ్చని పంటలు సాగు చేసుకుంటూ రైతన్నకు కల్పవల్లి అయిన అప్పనపల్లి గ్రామంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

సండే స్పెషల్

– దుబ్బాక రూరల్/దుబ్బాక:

న్యూస్‌రీల్

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా విద్యాధికారి, అసిస్టెంట్ కమిషనర్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: నవోదయలో ఆరవ తరగతిలో ప్రవేశాల కోసం శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షల నిమిత్తం సంగారెడ్డిలో 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 11.30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 1.30 నిమిషాల వరకు జరిగిన పరీక్షకు 1,613 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు మీడియాకు వెల్లడించారు. సంగారెడ్డిలోని విద్యానగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా విద్యాధికారి, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ శాంతినగర్, విద్యానగర్‌లలోని కరుణా స్కూల్ పరీక్ష కేంద్రాలను సందర్శించి పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు.

అర్హులైన వారికి రేషన్ కార్డులు

జహీరాబాద్ ఆర్డీవో రామ్‌రెడ్డి

రాయికోడ్(అందోల్): అర్హులైన ప్రతీ కుటుంబానికి రేషన్ కార్డులు జారీ అవుతాయని జహీరాబాద్ ఆర్డీవో రామ్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని ధర్మాపూర్ గ్రామంలో కొనసాగుతున్న రైతు భరోసా, రేషన్ కార్డుల దరఖాస్తుదారుల పరిశీలనను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సాగుకు యోగ్యం కాని భూములను పక్కాగా గుర్తించాలన్నారు. లే ఔట్లు, ఇళ్లను నిర్మించుకున్న భూములను గుర్తించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. రేషన్ కార్డు దరఖాస్తుదారుల ఆదాయం ఏడాదికి రూ.1.50 లక్షల లోపు, ఏడున్నర ఎకరాల లోపు మాత్రమే వ్యవసాయ భూమి కలిగి ఉన్న వారికే కార్డులు మంజూరవుతాయని స్పష్టం చేశారు. ఈ నెల 21వ తేదీలోపు దరఖాస్తుదారుల సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ఖదీర్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించేలా బోధన

మోడల్ స్కూల్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గా ప్రసాద్

రాయికోడ్(అందోల్): ఇంటర్మీడియెట్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని మోడల్ స్కూల్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గా ప్రసాద్ ఉపాధ్యాయులకు సూచించారు. రాయికోడ్‌లోని మోడల్ స్కూల్, కళాశాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పాఠ్యాంశాలను విద్యార్థులు శ్రద్ధగా విని పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని ఎంచుకున్న లక్ష్యాలకు తగ్గట్లుగా సాధన చేయడంతోపాటు ఉపాధ్యాయుల మార్గదర్శకాలు కూడా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రవీంధర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరో 4 మున్సిపాలిటీలు

- జహీరాబాద్‌లో ఒకటి, పటాన్‌చెరులో మూడు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- పురపాలికలుగా మారిన మేజర్ గ్రామ పంచాయతీలు

సంగారెడ్డి జోన్: జిల్లాలో నాలుగు కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటయ్యాయి. జిల్లాలో ఎనిమిది పురపాలికలు ఉండగా, కొత్తగా ఏర్పాటైన వాటితో కలిపి 12కు చేరాయి. మేజర్ గ్రామపంచాయతీలతో పాటు పలు గ్రామపంచాయతీలను కలుపుతూ మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జానాభా ఆధారంగా మున్సిపాలిటీల ఏర్పాటుకు అధికారులు గతేడాది ప్రతిపాదనలు పంపించిన సంగతి తెలిసిందే. జిల్లాలో జహీరాబాద్, నారాయణఖేడ్, సంగారెడ్డి, పటాన్‌చెరు, అందోల్, సదాశివపేట, అమీన్‌పూర్, ఐడీఏ బొల్లారం, తెల్లాపూర్ ఉన్నాయి. కొత్తగా కోహీర్, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్‌లు మున్సిపాలిటీలుగా ఏర్పడ్డాయి.



కోహీర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

ప్రభుత్వ ఆదేశాల మేరకు



జిల్లాలో నాలుగు కొత్త మున్సిపాలిటీలకు ప్రభుత్వం నుంచి గెజిట్ వచ్చింది. ఆదేశాల మేరకు నూతన మున్సిపాలిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

–సాయిబాబా, జిల్లా పంచాయతీ అధికారి, సంగారెడ్డి

విలీన గ్రామాల్లేకుండా కోహీర్ మున్సిపాలిటీ

మేజర్ గ్రామపంచాయతీగా కొనసాగుతున్న కోహీర్‌ను విలీన గ్రామాలు లేకుండా మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. ఇక గడ్డపోతారంలో కాజిపల్లి, మాదారం, వావిలాల, లక్ష్మీపతిగూడెం గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. గుమ్మడిదల మున్సిపాలిటీలో అన్నారం, బొంతపల్లి, వీరన్నగూడెం, దోమడుగు గ్రామ పంచాయతీలను విలీనం చేశారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీలో చిట్కుల్, పాశమైలారం గ్రామ పంచాయతీలను విలీనమవుతున్నాయి. జిల్లాలో ఉన్న ప్రస్తుత మున్సిపాలిటీలలో కొన్ని గ్రామాలను విలీనం చేశారు. తెల్లాపూర్ మున్సిపాలిటీలో కర్దనూర్, ముత్తంగి, పోచారం, పాటి, ఘనాపూర్ గ్రామపంచాయతీలను కలిపారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీలో ఐలాపూర్, ఐలాపూర్ తండా, పటేల్‌గూడా, దయారా, కిష్టారెడ్డిపేట, సుల్తాన్ పూర్ గ్రామ పంచాయతీలను విలీనం చేశారు.

'పుర'పాలనకు తెర

- ఈనెల 26తో పదవీకాలం పూర్తి
- ఇక ప్రత్యేక అధికారుల పాలనలోకి!
- రిజర్వేషన్ల మార్పుపై చర్చ
- జోరుగా అభివృద్ధి పనులు

నారాయణఖేడ్: మున్సిపాలిటీల పాలకవర్గాల పదవీకాలం ఈ నెల 26తో ముగియనుంది. పదవీ కాలం పూర్తవుతున్న తరుణంలో ఆయా మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. టీయూఎఫ్ఐడీసీతోపాటు ఇతర నిధులతో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం పనులు చేపడుతున్నారు. ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేక అధికారుల పాలనలోకి మున్సిపాలిటీలు వెళ్లనున్నాయి. ఫిబ్రవరి చివరి వారం లేదా మార్చిలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతోపాటు మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయనే ప్రచారం సాగుతుంది. పదవులు అనుభవించిన కౌన్సిలర్లు, చైర్మన్లు, వైస్ చైర్మన్లు మళ్లీ బరిలో నిలవాలని యోచిస్తున్నారు.

జిల్లాలో 7 మున్సిపాలిటీలకే ఎన్నికలు

జిల్లా సంగారెడ్డి, సదాశిపేట్, తెల్లాపూర్, జోగిపేట్, నారాయణఖేడ్, అమీన్‌పూర్, ఐడీఏ బొల్లారం మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగాయి. జహీరాబాద్ మున్సిపాలిటీలో పలు గ్రామాల విలీనంకు సంబంధించి కోర్టులో కేసు ఉన్నందున ఈ మున్సిపాలిటీకి ఎన్నికలు జరగలేదు. తెల్లాపూర్, అమీన్‌పూర్, బొల్లారం మున్సిపాలిటీలు జీహెచ్ఎంసీలో విలీనం కానున్నాయనే ప్రచారం జరుగుతోంది.



నారాయణఖేడ్ మున్సిపల్ కార్యాలయం

రిజర్వేషన్ల మార్పుపై అనుమానాలు

పంచాయతీ, జిల్లా, మండల పరిషత్తులకు రిజర్వేషన్లు మారుతాయని చర్చ జరుగుతోంది. మున్సిపాలిటీల రిజర్వేషన్లు అవే ఉంటాయా లేక మారుతాయా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో సంగారెడ్డి, సదాశివపేట్ బీసీ మహిళకు, జోగిపేట, నారాయణఖేడ్ బీసీ జనరల్‌కు, అమీన్‌పూర్, ఐడీఏ బోల్లారంలు అన్ రిజర్వ్‌డ్, తెల్లాపూర్ జనరల్ మహిళకు కేటాయించారు. జిల్లాలో 7 మున్సిపాలిటీలు వీటి పరిధిలోని 162 వార్డులకు ఎన్నికలు జరిగాయి. ఎస్టీలకు 7, ఎస్సీలకు 19, బీసీలకు 54, జనరల్ మహిళలకు 46 వార్డులు రిజర్వు అయ్యాయి. మొత్తమ్మీద మహిళలు 78 వార్డులకు ఎన్నికయ్యారు. అన్ని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పోరేషన్లకు ప్రత్యేక అధికారులను నియమించేందుకు కసరత్తు ప్రారంభమైంది.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి
- రూ.కోటి విలువైన సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ

నారాయణఖేడ్/కల్హేర్(నారాయణఖేడ్): ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో ప్రతీ ఒక్కరికీ మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 4, 9 వార్డుల్లో రూ.కోటితో నిర్మించనున్న సీసీ రోడ్లకు శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ...రూ.20 కోట్లతో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణ పనులు చేపట్టగా 80 శాతం పూర్తయ్యాయన్నారు. రూ.15 కోట్లతో త్వరలో తాగునీటి పైప్‌లైన్ల పనులు చేపడతామని తెలిపారు. ప్రజలు డీటీసీపీ నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవడంతో పాటు సెట్‌బ్యాక్, మొక్కల పెంపకం, మురుగుకాల్వల కోసం స్థలాలను వదలాలని సూచించారు. స్థలం కేటాయిస్తే లయన్స్‌క్లబ్ ద్వారా కంటి ఆస్పత్రి నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు.

కంటి శిబిరం ప్రారంభం

ఖేడ్‌లో లయన్స్ క్లబ్ సౌజన్యంతో నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి శిబిరాన్ని సంజీవరెడ్డి ప్రారంభించారు. అంతకుముందు దామరచెర్వుకు చెందిన విఠయ్యకు అత్యవసర వైద్యం నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.2 లక్షలకు సంబంధించిన ఎల్ఓసీని ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఖేడ్‌లోని శ్రీషిర్డీసాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయకమిటీ సభ్యులు వీరయ్య, మాణిక్ ప్రభు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. నిజాంపేట్ మండలం మునిగేపల్లిలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు అహ్మద్ పటేల్ కుటుంబాన్ని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పరామర్శించి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారంశంకర్, కౌన్సిలర్లు రాజేశ్ చౌహాన్, హన్మాండ్లు, మాజీద్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



కంటి శిబిరం ప్రారంభిస్తున్న సంజీవరెడ్డి

ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలి

టీఎస్ యూటీఎఫ్ కార్యదర్శి సాయిలు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ నాయకులు సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ...ప్రస్తుతం హైస్కూల్, హయ్యర్ సెకండరీ స్కూల్ ఉపాధ్యాయులు, కాలేజీ, యూనివర్సిటీల అధ్యాపకులకు మాత్రమే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ఉందన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సైతం ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలని కోరారు. ఈ మేరకు టీఎస్ యూటీఎఫ్ గతంలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు మంచి స్పందన లభించింది. ఈ జాబ్‌మేళాలో అపర్ణ ఎంటర్‌ప్రైజెస్, జెప్టో, హెటిరో, మెడ్‌ప్లస్, రూపీక్, హావెల్స్, ఫ్లిప్‌కార్ట్ వంటి 24 కంపెనీలు పాల్గొన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ రత్న ప్రసాద్ తెలిపారు. ఈ జాబ్‌మేళాకు 147 మంది హాజరు కాగా అందులో వివిధ కంపెనీలలో 91 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. భవిష్యత్తులో ఇంకా అనేక కంపెనీలతో జాబ్ మేళాను నిర్వహించి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జగదీశ్వర్, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ సదయ కుమార్ డాక్టర్ వాణి, డాక్టర్ సుమతి, వివిధ పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ రక్షిత మంచినీరు

- పురపాలికల అభివృద్ధిపై సమీక్షలో ఎమ్మెల్యే గూడెం
- 21, 22, 23 తేదీలలో ప్రారంభోత్సవాలు,శంకుస్థాపనలు

పటాన్‌చెరు: నియోజకవర్గ పరిధిలోని ఇంటింటికీ రక్షిత మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీల పరిధిలో ఈ నెల 21, 22, 23 తేదీలలో వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. పటాన్‌చెరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయా మున్సిపాలిటీల చైర్మన్లు,కమిషనర్లు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మాట్లాడుతూ...ఈ నెలాఖరులో మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు ముగియనున్న నేపథ్యంలో పూర్తిచేసిన అభివృద్ధిపనులను ప్రారంభించడంతో పాటు.. నూతన పనులకు శంకుస్థాపన చేయనున్నామన్నారు. వీటితోపాటు జలమండలి ద్వారా చేపట్టిన నూతన రిజర్వాయర్లను ప్రారంభిస్తామని తెలిపారు. ఆపదకాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఆపన్న హస్తం అందిస్తోందని చెప్పారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డిపేటకు చెందిన సందీప్ కుమార్‌కు సీఎంఆర్ఎఫ్ నుంచి వైద్యం కోసం మంజూరైన 2.50 లక్షల విలువైన ఎల్ఓసీ అనుమతి పత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు. నిరుపేదల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. పారదర్శకతతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజా పాలన అందిస్తున్నామన్నారు. సమీక్షలో అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహగౌడ్, తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములుగౌడ్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



ఎల్ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

డ్రైవింగ్‌తో మహిళలకూ ఉపాధి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి జోన్/జిన్నారం (పటాన్‌చెరు): మహిళలు కారు డ్రైవింగ్‌తో ఉపాధి పొందే అవకాశంతో పాటు మహిళా ఉద్యోగులకు ఎన్నో ప్రయోజనాలున్నాయని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఎస్‌బీఐ- స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఎంపిక చేసిన మహిళలకు నెల రోజులు డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శనివారం శిక్షణ ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ క్రాంతి హాజరై, శిక్షణ పొందిన 33 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం శిక్షణ పొందిన మహిళా డ్రైవర్ కారు నడుపుతుండగా అందులో కూర్చొన్న కలెక్టర్ పాత డీఆర్డీఏ కార్యాలయం నుంచి క్యాంపు కార్యాలయం వరకు ప్రయాణించారు.

పకడ్బందీగా లబ్ధిదారుల ఎంపిక

సంక్షేమపథకాల లబ్ధిదారుల ఎంపికను పకడ్బందీగా చేయాలని పారదర్శకంగా జాబితా రూపొందించాలని కలెక్టర్ క్రాంతి స్పష్టం చేశారు. గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి నల్లవల్లి గ్రామాల్లో సర్వేను ఆమె తనిఖీ చేశారు. ఈనెల 20నాటికి ఆయా పథకాలకు అర్హుల జాబితాను రూపొందించి 21 నుంచి 24వ తేదీ వరకు ఎంపీడీవోలు తహసీల్దార్లు మండల ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో గ్రామసభలు నిర్వహించాలని ఆదేశించారు.



శిక్షణ పొందిన మహిళకు సర్టిఫికెట్ అందిస్తున్న కలెక్టర్

అనుమతుల్లేకుంటే మూసివేతే!

- జిల్లాలో జనవరి నుంచి 13 ఆసుపత్రులు సీజ్
- 44 హాస్పిటల్స్‌కు జరిమానా
- జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి వెల్లడి

హత్నూర(సంగారెడ్డి): అనుమతులు లేకుండా నిర్వహించే ఆసుపత్రులు, డయాగ్నొస్టిక్ కేంద్రాలను మూసివేస్తామని వాటిపై చర్యలకు ఉపేక్షించేది లేదని జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి స్పష్టం చేశారు. మండల కేంద్రమైన హత్నూరలోని విజయ డయాగ్నొస్టిక్ సెంటర్‌తోపాటు ఆర్ఎంపీ శ్రీశైలంకు చెందిన జై భవాని క్లినిక్‌ను ఆమె శనివారం ఆకస్మిక తనిఖీ చేపట్టి సీజ్ చేశారు. విజయ డయాగ్నొస్టిక్ సెంటర్‌తోపాటు జై భవాని ఆర్ఎంపీ క్లినిక్‌కు కూడా గతంలో నోటీసులు ఇచ్చామని అయినా అనుమతుల్లేకుండా నిర్వహించడంతో ఈ రెండింటినీ సీజ్ చేసినట్లు గాయత్రీదేవి వెల్లడించారు. జిల్లాలో జనవరి 1 నుంచి ఇప్పటివరకు 13 క్లినిక్‌లకు నోటీసులు జారీ చేసి సీజ్ చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో 44 క్లినిక్‌లకు ఇప్పటివరకు జరిమానాలు విధించినట్లు తెలిపారు. అంతకుముందు మండల కేంద్రమైన హత్నూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గాయత్రీదేవి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిధిలో ఏడుగురు గర్భిణులు ఉండగా ఇప్పటికే నలుగురికి ఆస్పత్రిలోనే ప్రసూతి సేవలు అందించినట్లు చెప్పారు.



హత్నూరలో ఆర్ఎంపీ ఆసుపత్రిని సీజ్ చేస్తున్న జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి

నేడే మల్లన్న 'పట్నం వారం'



స్వామివారి ధూళి దర్శనం చేసుకునేందుకు కానుకలతో తరలివస్తున్న భక్తులు

- బ్రహ్మోత్సవాలకు కొమురవెల్లి సర్వంసిద్ధం
- మహాజాతరకు తరలిరానున్న లక్షలాదిమంది భక్తులు



స్వామి వారి మూలవిరాట్టు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం.. బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. సంక్రాంతి తర్వాత వచ్చే మొదటి ఆదివారంతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. మొదటి వారాన్ని పట్నం వారంగా పిలుస్తారు. మూడు నెలల పాటు జాతర కొనసాగనుంది. ఈ క్రమంలో మొదటి ఆదివారం హైదరాబాద్‌కు చెందిన భక్తులు మల్లన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాలనుంచి భక్తులు లక్షలాదిగా తరలిరానున్నారు. సోమవారం తోట బావివద్ద నగరానికి చెందిన భక్తులు నిర్వహించే పెద్ద పట్నం, అగ్నిగుండాలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కొమురవెల్లికి భక్తుల రాక మొదలైంది. నేరుగా స్వామివారిని ధూళి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు.

స్పెషల్ బస్సులు..

మల్లన్న జాతరకు వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ అధికారులు స్పెషల్ బస్సులు నడిపిస్తున్నారు. అన్ని రూట్ల నుంచి కొమురవెల్లికి చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేశారు.

రూ.కోట్ల నిధులు మట్టిపాలు!



చెరువుకట్టపై కుప్పలుగా వదిలేసిన మట్టి

- దశాబ్దకాలంగా పూర్తికాని 'మినీ ట్యాంక్ బండ్'
- ఇప్పటివరకు రూ.7.45 కోట్లు కేటాయింపు
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు మంత్రి దామోదర కృషి
- టీఎఫ్ఐడీసీ కింద రూ.2.50 కోట్లు మంజూరు

జోగిపేట(అందోల్): అందోల్‌లోని పెద్ద చెరువు కట్టను మినీ ట్యాంక్‌బండ్‌గా నిర్మించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యం తీరని కలగానే మిగిలిపోతోంది. దశాబ్దం క్రితం ప్రారంభమైన ఈ ట్యాంక్‌బండ్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వం నుంచి రూ.కోట్ల నిధులు మంజూరైనా ఆ డబ్బులన్నీ మట్టిపాలయ్యాయే తప్ప మినీ ట్యాంక్‌బండ్ మాత్రం నేటికీ పూర్తవ్వలేదు. మంత్రి దామోదర ప్రత్యేక దృష్టి పెట్టడంతో ఇప్పటికైనా పూర్తయ్యేనా అని స్థానికులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

బిల్లులు మంజూరుకాక నిలిచిన పనులు...

మినీ ట్యాంక్ బండ్ పనులకు 2016లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.4.9 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో కట్టపై రోడ్డు వెడల్పు, రివీట్‌మెంట్ పనులు, స్టాల్స్, రోడ్డు లైనింగ్, లైటింగ్ వంటి పనులను చేపట్టేందుకు నీటిపారుదల శాఖ ప్రణాళికను రూపొందించింది. ఈ పనుల్లో భాగంగా నాందేడ్-అకోలా రహదారిని ఆనుకుని ఉన్న 450 మీటర్ల పొడుగైన కట్ట ఎత్తును ఆరు మీటర్లు పెంచాల్సి ఉండగా అప్పటి ఎమ్మెల్యే బాబూమోహన్ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి రిటర్నింగ్‌వాల్‌ను పది మీటర్ల ఎత్తుకు పెంచుతూ నిర్మించారు. రిటర్నింగ్‌వాల్‌పై భారీగా మట్టిని కట్టపైకి తరలించి వెడల్పు చేసే పనులను చేపట్టారు. ఈ పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

ఎస్‌డీఎఫ్ నిధులతో పనులు...

2018లో ప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి నిధుల (ఎస్‌డీఎఫ్) కింద రూ.2.55 కోట్లు మంజూరు కాగా ఈ నిధులతో కూడా వందల సంఖ్యలో టిప్పర్లతో మట్టిని రెండవసారి కట్ట వెడల్పు కోసమే తరలించారు. రిటర్నింగ్‌వాల్‌కు మధ్య ఎలాంటి నిర్మాణం చేయకపోవడంతో కట్టపై పోసిన మట్టి వర్షాకాలంలో జాతీయ రహదారిపైకి కొట్టుకుపోయింది. తర్వాత రిటర్నింగ్‌వాల్ ఎత్తు పెంచి మట్టి కిందకు జారిపడిపోకుండా నిర్మాణాలు చేపట్టారు. అయితే ఎస్‌డీఎఫ్ నిధుల కింద చేపడుతున్న పనులను నిలిపివేయాలని కలెక్టర్ ఆదేశించడంతో ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి.



పిచ్చి మొక్కలు, చెత్తా చెదారంతో వాకింగ్ ట్రాక్

నాణ్యత లేకుండా వాకింగ్ ట్రాక్ నిర్మాణం

మినీ ట్యాంక్ బండ్ నిర్మాణంలో భాగంగా అయ్యప్ప దేవాలయం వెనుకభాగంలో సుమారుగా 300 మీటర్ల పొడువునా నాణ్యత లేకుండా నిర్మించిన వాకింగ్ ట్రాక్ ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. కొద్దిదూరం సీసీ రోడ్డును వేసి వదిలేశారు. ప్రస్తుతం వాకింగ్ ట్రాక్ పిచ్చి మొక్కలు, చెత్తా చెదారంతో నిండిపోయింది.

మంత్రి దామోదర ప్రత్యేక దృష్టి

మినీ ట్యాంక్ బండ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేయించారు. అవసరమైన పనులు చేపట్టేందుకు టీఎఫ్ఐడీసీ కింద రూ.2.50 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో కట్టపై సీసీ రోడ్డు నిర్మాణం, లైటింగ్, రెయిలింగ్, పార్కు నిర్మాణం వంటి పనులను చేపట్టనున్నారు.

క్లుప్తంగా

పనులు త్వరగా పూర్తి చేయాలి

సిద్దిపేటఅర్బన్: జిల్లా జైలు భవన నిర్మాణ పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామ పరిధిలో నిర్మిస్తున్న జిల్లా జైలు భవన నిర్మాణ పనులను శనివారం సీపీ అనురాధ, ఇతర సీనియర్ అధికారులతో కలిసి పరిశీలించారు. పనులు ఆశించిన రీతిలో జరుగుతున్నాయని పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి ఉప యోగంలోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజీ మురళీ బాబు, డీఐజీలు శ్రీనివాస్, సంపత్, జైల్ సూపరింటెండెంట్ దశరథం, హౌసింగ్ కార్పొరేషన్ సభ్యులు తులసీదర్ రెడ్డి, సీఈ రాజయ్య, డీఈ సుధాకర్, ఏసీపీ మధు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

గజ్వేల్‌రూరల్: కుటుంబ కలహాలతో ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన శనివారం గజ్వేల్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(బ్రాహ్మణ బంజేరుపల్లి)కి చెందిన నర్సయ్య(54) కుటుంబ కలహాలతో 15న ఇంట్లో నుంచి బయటకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు నాలుగు రోజులుగా చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సిద్దిపేటలో మరో వ్యక్తి..

సిద్దిపేటజోన్: చుట్టపు చూపుగా వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన శనివారం సిద్దిపేటలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు కథనం ప్రకారం హైదరాబాద్ కవాడిగూడకు చెందిన సంతోష్ సంక్రాంతి సందర్భంగా పట్టణంలోని కంచరి బజార్‌కు చెందిన తన బావ సురేశ్ ఇంటికి వచ్చాడు. 15న మల్లన్న దర్శనం కోసం కొమురవెల్లి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో శనివారం అతడి బావ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సింగపూర్‌లో సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మల్లంపేట వాసి

పాపన్నపేట(మెదక్): సీఎం రేవంత్ రెడ్డిని శనివారం పాపన్నపేట మండలం మల్లంపేటకు చెందిన సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు పుల్లన్న గారి శ్రీనివాస్ రెడ్డి కలిశారు. తెలంగాణ రైజింగ్ ప్రధాన ఎజెండాగా సింగపూర్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి త్వరలో జరగనున్న సింగపూర్ తెలుగు సమాజం స్వర్ణోత్సవ (50వ) వేడుకలకు రావాలని ఆహ్వానించినట్లు తెలిపారు.


ఊరంతా ఊట బావులే..

వ్యవసాయ బావులకి కేరాఫ్ అప్పనపల్లి

- బావులే ఈ ఊరికి జీవనాధారం
- 600 పైగా బావులుంటే.. 20 లోపు బోర్లు



దుబ్బాక రూరల్/దుబ్బాక : తరతరాల నుంచి వ్యవసాయమే జీవనాధారంగా వస్తున్న దుబ్బాక మండలం అప్పనపల్లి ఊరిలో వ్యవసాయ బావుల జోరు కనిపిస్తుంది. ఈరోజుల్లో కూడా బోరు బావులు ఎక్కడో ఓ చోట తప్ప పెద్దగా కనబడవు. సహజంగా గ్రామాల్లో 30 ఏళ్ల కిందట వరకు అంతటా చెరువులు, బావులపైనే ఆధారపడి ఎవుసం సాగేది. కాలక్రమేణ బోర్లు రావడంతో గ్రామాల్లో బావులు కనబడకుండా పోయాయి. ఇప్పుడు ఎక్కడ చూసినా బోర్ల మీదనే ఆధారపడి రైతులు పంటలు పండిస్తున్నారు. అప్పనపల్లిలో మాత్రం బావులతోనే రైతులు పంటలు పండిస్తుండటం విశేషం.


క్రేన్ సహాయంతో తవ్వుతున్న బావులు

బావులతోనే పంటల సాగు

అప్పనపల్లిలో వ్యవసాయమంతా బావులపైననే ఆధారపడి జరుగుతుంది. దీంతో పొలాల వద్ద ఎటు చూసిన బావుల వద్ద క్రేన్‌లు కనిపిస్తుంటాయి. ఎంతటి బీడు భూమైన నీటి వసతి ఉంటేనే భూములు సాగులోకి వస్తాయి. రైతులు నీటి వసతి కోసం విచ్చలవిడిగా బోర్లు వేస్తూనే ఉంటారు. గతంలో రైతులు బావులు వ్యవసాయం చేస్తుండేవారు. క్రేన్ సహాయంతో బావులు తవ్వే కొద్ది సైడ్‌నుంచి నీటి ఊటలు వచ్చేవి. నీళ్లు ఎక్కువ రావడానికి బావుల్లో సైడ్ బోర్లు వేసే వారు. బావి మధ్యలో బోరు మోటార్ పెట్టి పొలాలను సాగు చేసేటోళ్లు. రైతులు తమ పొలాలకు నీటిని సరఫరా చేయాలంటే పొలాల వద్దే తెల్లవారేదాకా ఉండేవారు. ప్రస్తుత కాలంలో బావులు కనుమరుగయ్యాయి. ప్రతీ రైతు తమ వ్యవసాయ భూముల్లో బోర్లు వేసి వాటి ద్వారానే వ్యవసాయం సాగు చేస్తున్నారు. దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామంలో ఇప్పటికే బావులను తవ్వి వాటి ద్వారానే వ్యవసాయం చేస్తున్నారు.

600కు పైగా బావులు..

అప్పనపల్లి గ్రామానికి 1,300 ఎకరాలకు పైగా శివారు ఉండగా ఊరు, రోడ్లు పోను 1,100 ఎకరాలు అలాగే పెద్దగుండవెల్లి శివారులో మరో 300 ఎకరాలు మొత్తం 1,400 ఎకరాల వరకు పంటలు సాగవుతాయి. గ్రామంలో ప్రస్తుతం 600 పై చిలుకు బావులుంటే కేవలం 20లోపు మాత్రమే బోర్లు ఉన్నాయి. ఈ సంవత్సరంలోనే కొత్తగా 10 మంది రైతులు బావులు తవ్వి వ్యవసాయం చేసుకుంటున్నారు. ఇప్పుడు ఇటాచీ, జేసీబీలతో కేవలం నాలుగైదు రోజుల్లోనే పెద్ద పెద్ద బావులు తవ్విస్తారు. కొద్ది లోతు బావి, పూడిక తీతలకు మాత్రం క్రేన్‌లను ఉపయోగిస్తున్నారు.



15 గజాల లోతుల్లోనే నీటి ఊటలు

రైతులు తమ భూముల్లో బావులు తవ్వితే 5 నుంచి 15 గజాల లోతులో నీటి ఊటలు వస్తాయి. మీదనే బండరాయి వచ్చినా ఆ రాయి సారికల మధ్య నుంచి నీటి ఊటలు పుష్కలంగా వస్తాయి. దీంతో రైతులు ఒక్కో బావి 20 నుంచి 30 గజాల లోతు వరకు తవ్విస్తారు. బావుల్లో ఎక్కువ నీరు రావడానికి లోపల చుట్టుపక్కల సైడ్ బోర్లు వేస్తారు. వ్యవసాయ సాగు కోసం 24 గంటల విద్యుత్ సరఫరా ఉండడంతో 3 ఎకరాల నుంచి 5 ఎకరాల వరకు వ్యవసాయం సాగు చేస్తారు. వరి పొలంతో పాటుగా కూరగాయలు,వివిధ రకాల పంటలు పండిస్తారు. వేసవి కాలం, వర్షాకాలంలో బావుల ద్వారా వచ్చే నీటి ద్వారానే పొలాలు సాగు చేస్తారు. బావుల్లో నీటి ఊటలు వస్తూనే ఉంటాయి.


బావిలో పుష్కలంగా నీళ్లు

కల్ప తరువు.. లొద్ది చెరువు


లొద్ది చెరువులో నీరు

గ్రామ శివారులో లొద్ది చెరువు ఉండి నీరు ఎప్పటికీ నిల్వ ఉంటుంది. ఎన్ని కరువు కాటకాలు ఏర్పడిన ప్పటికీ లొద్ది చెరువులో మాత్రం నీరు తగ్గదు. లొద్ది చెరువు ద్వారానే బావుల్లో నీటి ఊటలు వస్తాయని గ్రామస్తులు చెబుతున్నారు. పూర్వం నుంచి లొద్ది చెరువు ద్వారానే బావుల్లోకి ఊటలు వస్తాయి. చుట్టు ప్రక్క గ్రామాల్లో ఉన్న చెరువులు ఎండి పోయినప్పటికీ ఈ చెరువు మాత్రం ఎండిపోలేదు.

మా గ్రామంలో బావులే ఎక్కువ



మాగ్రామంలో ఎక్కువగా బావులే ఉంటాయి. బావుల ద్వారానే వ్యవసాయం సాగు చేస్తాం. ఇప్పటికి రైతులు తమ భూముల్లో బావులు తవ్విస్తున్నారు. బోర్లు అస్సలే వేయరు. 600 వరకు బావులు ఉండగా, 20 మాత్రమే బోరు బావులు ఉన్నాయి.

– చిర్ర యాదగిరి, రైతు

15 గజాల లోతుల్లో నీరు



మా భూముల్లో బావులు తవ్వితే 5 గజాల నుంచి 15 గజాల లోతుల్లో నీళ్లు వస్తాయి. ఇప్పటికీ క్రేన్ సహాయంతో బావులు తవ్వుతాం. బోర్లు వేయడం అనేది మా ఊరిలో లేదు. ఒక్కో బావి 3 నుంచి 5 ఎకరాల వరకు వ్యవసాయ సాగు కోసం నీరందిస్తుంది. 24 గంటల విద్యుత్ సరఫరా ఉండడంతో వ్యవసాయానికి సాఫీగా నీరందుతుంది.

– కొండి రాజిరెడ్డి, రైతు

లొద్ది చెరువుతో జీవనాధారం



మా గ్రామ శివారులో లొద్ది చెరువు ఉంది. లొద్ది చెరువు అనేది ఇప్పటి వరకు ఎండిపోయిన చరిత్ర లేదు. చెరువులో ఎప్పటికీ నీళ్లు పుష్కలంగా ఉంటాయి. ఇదే మాకు జీవనాధారం. దీని ద్వారానే బావుల్లోకి నీటి ఊటలు వస్తాయి. బావుల్లో నీరు పై పైకి వచ్చి తమ పంటలు పండుతాయి.

– తిరుపతి, రైతు

భూమి స్వరూపంతోనే..

న్యాచురల్‌గా కొన్ని ప్రాంతాల్లో భూముల స్వరూపంతో భూగర్భజలాలు సమృద్ధిగా ఒకే చోట ఉంటాయి. ఈ తరహాలోనే అప్పనపల్లిలో బండరాళ్లు ఉన్నప్పటికీ గ్రౌండ్ వాటర్ ఎక్కువగా రీచార్జ్ అవుతుంది. వర్షాలు కురిసినప్పుడు నీరు భూమిలోకి సమృద్ధిగా ఇంకి ఉండి అక్కడి నుంచి భూమి పొర లోపల బండ ఉండడంతో వేరే చోటికి నీరు పోకుండా నిల్వ ఉంటుంది. అప్పనపల్లిలో వాటర్ రీచార్జ్ ఎక్కువ అవుతుండడం ద్వారానే నీటి నిల్వలు పుష్కలంగా ఉండి బావుల్లో నీరు వస్తున్నాయి.

– సీతారాం, జిల్లా భూగర్భ జలాల సమృద్ధి అధికారి

అప్పనపల్లి గ్రామ సమాచారం

కుటుంబాలు	: 500
జనాభా	: 2,200 పైనే
సాగు భూమి	: 1300 ఎకరాలు
బావులు	: 600 పైనే
బోర్లు	: 20 లోపు
పంటలు	: వరి, మొక్కజొన్న, కూరగాయలు,కంది



అప్పనపల్లి గ్రామం బోర్డు

భవన కార్మికులకు ప్రభుత్వం అండగా నిలవాలి

- ప్రమాద బీమాను రూ.10 లక్షలకు పెంచాలి
- 31 హైద్రాబాద్‌లో టీబీఎన్‌ఆర్‌కేఎస్ రాష్ట్ర స్థాయి మహాసభ
- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దేశ, రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న భవన నిర్మాణ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలువాలని తెలంగాణ భవన నిర్మాణ రంగ కార్మికుల సంఘం (టీబీఎన్‌ఆర్‌కేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా టీబీఎన్‌ఆర్‌కేఎస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు రావాల్సిన ప్రభుత్వ పథకాలు అందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ప్రమాదవశాత్తు గాయపడిన, మరణించిన కార్మికుడి కుటుంబానికి ప్రమాద బీమా పాలసీని రూ.10 లక్షలకు పెంచాలన్నారు. కార్మికుల పిల్లలకు కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉచితంగా విద్యను అందించే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని మద్యం బెల్టు షాప్‌లను మూసివేసే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. భవన నిర్మాణ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్‌కు వినతి పత్రం అందించనున్నట్లు తెలిపారు.31న హైద్రాబాద్‌లోని అంజయ్య కార్మిక భవన్‌లో టీబీఎన్‌ఆర్‌కేఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో టీబీఎన్‌ఆర్‌కేఎస్ రాష్ట్ర కార్యదర్శి తోట్ల పరుశరాములు, రాష్ట్ర సలహాదారులు నాయిని రామస్వామి, జనగామ జిల్లా అధ్యక్షుడు తుడి అంజయ్య, ప్రధాన కార్యదర్శి కొమ్మగళ్ల కృష్ణ, కోశాధికారి రామన్న, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రశాంత్, జనగామ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

చరిత్ర తెలుసుకొని మాట్లాడాలి

- రాజ్యాంగాన్ని విస్మరిస్తున్న బీజేపీ
- మార్చాలని కుట్రలు చేస్తే గుణపాఠం తప్పదు
- సంవిధాన్ బచావో ర్యాలీలో కాంగ్రెస్ నేత వీహెచ్

చేర్యాల(సిద్దిపేట): బీజేపీ నాయకులు దేశ చరిత్ర తెలుసుకొని మాట్లాడాలని, బాబా సాహెబ్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చాలని కుట్రలు చేస్తున్న బీజేపీకి గుణపాఠం తప్పదని మాజీ పీసీసీ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వీ.హనుమంతారావు అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సంవిధాన్ బచావో పాదయాత్రలో వీహెచ్ పాల్గొన్నారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి క్షీరాభిషేకం చేశారు. అనంతరం పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ కృషి చేస్తుందని, రాజ్యాంగాన్ని మార్చాలన్న బీజేపీ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. చరిత్ర తెలియని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. భవిష్యత్‌లో రాహుల్ గాంధీ అధ్యక్షతన రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము రవి, పీఏసీఎస్ చైర్మన్ మేర్గు కృష్ణాగౌడ్, జిల్లా, పట్టణ నాయకులు, మండల నాయకులు, మహిళా నాయకురాళ్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హనుమంతరావు

డీసీఎంను ఢీకొట్టిన టవేరా వాహనం

ఒకరు మృతి, మరొకరికి గాయాలు


మేరాజ్ అలీ మృతదేహం

కొండపాక(గజ్వేల్): డీసీఎంను టవేరా వాహనం ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన కొండపాక శివారులో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ కథనం మేరకు.. కోదాడకు చెందిన సయ్యద్ మేరాజ్ అలీ (45) సిద్దిపేటలో బంధువుల ఇంటికి వెళ్లేందుకు సికింద్రాబాద్ జూబ్లీబస్టాండ్‌లో బస్సు కోసం నిల్చున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు న్యూస్ పేపర్లను తీసుకెళ్లే టవేరా వాహనం రాగానే సిద్దిపేట వరకు వెళ్లేందుకు ఎక్కాడు. కొండపాక శివారులోకి రాగానే రాజీవ్ రహదారి పక్కన ఆగి ఉన్న డీసీం వాహనాన్ని టవేరా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మేరాజ్ అలీ మృతి చెందగా, డ్రైవరు రఫీక్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీనివాస్‌తో పాటు పోలీసులు హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకొని అలీ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చెరుకు లారీ ఢీకొని చిరు వ్యాపారి

నారాయణఖేడ్: చెరుకు లారీ ఢీకొని చిరు వ్యాపారి మృతి చెందాడు. ఈ ఘటన ఖేడ్ పట్టణ శివారులోని మోడల్ డిగ్రీ కళాశాల సమీపంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నారాయణఖేడ్ మండలం హంగర్గ (బి) గ్రామానికి చెందిన రఫీక్(42) మోపెడ్‌పై సమోసాలను సరఫరా చేస్తుంటాడు. శుక్రవారం నిజాంపేట ప్రాంతంలో సమోసాలను సరఫరా చేసి తిరిగి నారాయణఖేడ్ వైపు వస్తున్నాడు. మోడల్ డిగ్రీ కళాశాల సమీపంలో చెరకు లోడ్‌తో ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రఫీక్‌కు తీవ్ర గాయాలు కాగా నారాయణఖేడ్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.

ఆటో, బైక్ ఢీ : ఏడుగురికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు

నారాయణఖేడ్: ఆటో, బైక్ ఢీకొని ఏడుగురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన అకోలా–నాందేడ్–హైదరాబాద్ 161 జాతీయ రహదారిపై నిజాంపేట్ వద్ద శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. నిజాంపేట మండలం కొత్తపల్లికి చెందిన గంగమ్మ(40), భర్త రామయ్య (45), సాయిలు (35), సియోాలు(22), సాలమ్మ(35) పెద్దశంకరంపేట నుంచి నిజాంపేట వైపు ఆటోలో వస్తుండగా పెద్దశంకరం పేటకు చెందిన యువకులు బైక్‌పై వెళ్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా బైక్ ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను నారాయణఖేడ్ ఆస్పత్రికి తరలించారు.

దొంగల బీభత్సం

కౌడిపల్లి(నర్సాపూర్): తాళం వేసిన రెండు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన మండల కేంద్రమైన కౌడిపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కౌడిపల్లి కొత్తకాలనీలో నివాసం ఉండే నాసర్‌ఖాన్ వారం కిందట హైదరాబాద్‌లో బంధువుల పెళ్లికి వెళ్లి శనివారం తెల్లవారుజామున ఇంటికి రాగా తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని 5 తులాల బంగారు, 50 తులాల వెండి ఆభరణాలతోపాటు రూ.2లక్షల నగదు చోరీకి గురయ్యాయి. పక్కనే మరో ఇంట్లో తులం 4 గ్రాములు బంగారు కమ్మలు, మాటీలు, 30 తులాల వెండి ఆభరణాలు చోరీ చేశారు. దీంతోపాటు సమీపంలోని ఆర్‌ఎంపీ ప్రభాకర్ స్కూటీని ఎత్తుకెళ్లారు. చోరీల విషయం తెలియడంతో నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ విఠల్ తెలిపారు. ఇదిలా ఉండగా చోరీకి గురైన స్కూటీ తునికి గురుకుల పాఠశాల వెనుకగా అటవీ ప్రాంతంలో దొరకడంతో పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు.

ఆలయంలో చోరీ

రామాయంపేట(మెదక్): రామాయంపేటలోని ఎల్లమ్మ గుడిలో శుక్రవారం రాత్రి ఇద్దరు దొంగలు చోరీకి పాల్పడ్డారు. హుండీ ఎత్తుకెళ్లి సుమారు రూ.20 వేల నగదును అపహరించుకపోయారని ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు. దుండగుల ఆనవాళ్లు గుడిలో ఉన్న సీసీ పుటేజీలో నమోదయ్యాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కంది రైతుకు ఊరట

- జిల్లాలో ఆరు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- క్వింటాల్‌కు రూ.7,550 మద్దతు ధర
- 25 వేల క్వింటాళ్ల దిగుబడి అంచనా

సిద్దిపేటజోన్: జిల్లా వ్యాప్తంగా కంది పంటను సాగు చేసిన రైతులకు ఇది ఊరట లాంటిదే. రైతులకు మద్దతు ధర అందించే ఆలోచనలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. ఈ మేరకు జిల్లా అధికారుల ప్రతిపాదనలకు అనుగుణంగా ప్రభుత్వం ఆరు మంజూరు చేసింది. ఇందులో ఒక్కటి సిద్దిపేట పత్తి మార్కెట్ యార్డులో మంత్రి పొన్నం ప్రభాకర్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మిగితా గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాల, దుబ్బాక ,తొగుట ప్రాంతాల్లో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో పీఏసీఎస్‌ల ద్వారా మరో వారం రోజుల్లో అందుబాటులోకి తేనున్నారు.


సిద్దిపేట పత్తి మార్కెట్ యార్డులో కందులు

రూ.7,550 మద్దతు ధర

ఈయేడు ప్రభుత్వం క్వింటాల్ కందులకు రూ.7,550 మద్దతు ధర ప్రకటించింది. రెండేళ్లుగా మద్దతు ధర కంటే ప్రైవేటు వ్యాపారులు అధికంగా ధర ఇవ్వడంతో ప్రభుత్వం ఎలాంటి కొనుగోళ్లు చేయలేదు. ప్రస్తుతం జిల్లాలో కంది పంట కోతలు ప్రారంభం కావడంతో నెలాఖరులోగా పెద్ద ఎత్తున మార్కెట్‌లోకి పంట దిగుమతి వస్తుందనే నేపథ్యంలో ముందస్తుగా జిల్లాలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కంది సాగుకు ఆస్కారం ఉన్న ప్రాంతాలకు అనుగుణంగా ఆరు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

25 వేల క్వింటాళ్ల దిగుబడి అంచనా

జిల్లా వ్యాప్తంగా 16 మండలాల్లో రైతులు కంది పంట సాగు చేస్తున్నారు. జిల్లా వ్యవసాయ శాఖ రికార్డుల ప్రకారం ఖరీఫ్ సీజన్‌లో సుమారు 7 వేల ఎకరాల్లో కంది పంట సాగైనట్లు తెలుస్తోంది. ఈ లెక్కన ఈయేడు సుమారు 25 వేల క్వింటాళ్ల వరకు కందులు దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్లుగా రైతులు ఇబ్బంది పడొద్దని కేంద్రాలపై దృష్టి సారించారు.

67.45 శాతం హాజరు

- ప్రశాంతంగా నవోదయ పరీక్ష
- ఉమ్మడి జిల్లాలో 4,361 మంది విద్యార్థులు


నారాయణఖేడ్ పరీక్ష కేంద్రంలో నవోదయ ప్రిన్సిపాల్ రాజేందర్

జిల్లా	కేంద్రాలు	హాజరు	గైర్హాజరు
సిద్దిపేట	10	1,665	585
సంగారెడ్డి	12	1,613	1,013
మెదక్	8	1,083	506
మొత్తం	30	4,361	2,104

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 2025–26 విద్యాసంవత్సరంలో వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశానికి 30 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. మొత్తం 6,465 మంది విద్యార్థులకు గాను 4,361 మంది పరీక్షకు హాజరైనట్లు వర్గల్ నవోదయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. మొత్తం మీద 67.45 శాతం హాజరైనట్లు వివరించారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరిగిందన్నారు. నారాయణఖేడ్ తదితర కేంద్రాలను తాను సందర్శించి పరీక్ష నిర్వహణ పరిశీలించినట్లు పేర్కొన్నారు. సమర్థవంతంగా పరీక్ష నిర్వహణలో సహకారమందించిన ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్లకు, విద్యాధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.